జగనన్న సురక్షతో అర్హులందరికీ లబ్ధి

- మంత్రి అంబటి రాంబాబు
- వార్డు ప్రజలకు ధ్రువీకరణ పత్రాల పంపిణీ

సత్తెనపల్లి: సాంకేతిక కారణాలు, చిన్న తప్పిదాలతో పథకాలు పొందలేక ఇబ్బందులు పడిన అర్హులందరికీ జగనన్న సురక్ష ద్వారా లబ్ధి చేకూరుతుందని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పట్టణంలోని మూడో వార్డులో శనివారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చరిత్రలో ఎన్నడూ జరగని విధంగా ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. అయినా చిన్న చిన్న లోపాలతో అనర్హుల జాబితాలో వాళ్ళందరినీ సర్వే చేసి, వారి లోపాలను సవరించి, వినతులు, సమస్యలను పరిష్కరించి అవసరమైన ధ్రువీకరణ పత్రాలు అందించే కార్యక్రమం చరిత్రాత్మకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్ఆర్ సీపీ రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల రాజనారాయణ, పక్కాల సూరిబాబు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ రమావత్ కోటేశ్వరావు నాయక్, పల్నాడు జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు, కౌన్సిలర్ అచ్యుత శివప్రసాద్, నాయకులు శిరిగిరి వెంకట్రావు, సంకుల తిరుపతిరావు ,పలు వార్డుల కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

ఇంటి వద్దనే సమస్యలకు పరిష్కారం

రాజుపాలెం: ప్రతీ ఇంటికి వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని వెంటనే పరిష్కారం అయ్యే విధంగా చర్యలు చేపట్టిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అని మండల కన్వీనర్ వేపూరి శ్రీనివాసరావు కొనియాడారు. మండలంలోని చౌటపాపాయపాలెం, మొక్కపాడు గ్రామాలలో తహసీల్దారు నళిని,ఎంపీడీవో టి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమాలు శనివారం నిర్వహించారు. వలంటీర్లు గ్రామంలో ఇంటింటా తిరిగి 88 దరఖాస్తులను స్వీకరించగా, అందులో 32 వాటికి ధ్రువపత్రాల్ని అందించారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయాల కన్వీనర్ పులిబండ్ల అశోక్, సర్పంచ్ వల్లా నాగరాజు, వ్యవసాయాధికారి వీరయ్య, ఈవోపీఆర్‌డీ ముక్కంటి, ఎంపీటీసీ ఎస్‌కే బీబీ పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో ప్రజల చెంతకు సేవలు

నకరికల్లు: జగనన్న సురక్షతో ప్రజల చెంతకు సేవలు అందుతాయని డ్వామా పీడీ బి.బాలూనాయక్ అన్నారు. మండలంలోని చల్లగుండ్లలో మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి ఆధ్వర్యంలో జగనన్న సురక్ష గ్రామసభ శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ మేచారవు అనురాధ, ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు జూనెబోయిన హరీష్, వైస్ ఎంపీపీ మేడం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, సర్పంచ్ అరవా ఆదిలక్ష్మి పాల్గొన్నారు.



ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేస్తున్న మంత్రి అంబటి రాంబాబు

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

బెల్లంకొండ: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందజేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం జగనన్న సురక్ష పథకాన్ని చేపట్టిందని ఎంపీపీ చెన్నపరెడ్డి పద్మా వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. మండలంలోని వన్నాయపాలెంలో శనివారం నిర్వహించిన 'జగనన్న సురక్ష'లో ఆయన పాల్గొన్నారు. అర్హత ఉండి పథకాలు అందని వారిని గుర్తించి, వారికి తక్షణమే అర్హత సాధించేలా చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష ద్వారా మరింత ప్రయోజనం

అచ్చంపేట: అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందుకోలేనివారికి, సకాలంలో ధ్రువీకరణ పత్రాలు రాని వారికి లబ్ధి చేకూరే విధంగా జగన్న సురక్ష పథకాన్ని ప్రవేశ పెట్టారని జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మా విజయ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని శనివారం మండలంలోని మాదిపాడు, కొందూరు గ్రామాల్లో నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి.శివసుబ్రమణ్యం, ఎంపీపీ భూక్యా రజనీకృష్ణానాయక్, సర్పంచ్ మాదా ఈశ్వరమ్మ, తహసీల్దారు సీహెచ్. ఉమాదేవి, సర్పంచ్ రామాంజనేయులు పాల్గొన్నారు.

ఆర్హులైన వారందరికీ సంక్షేమ ఫలాలు

అమరావతి: అర్హులైన ప్రతిక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించాలనే లక్ష్యంతో జగనన్న సురక్ష పథకం అమలు చేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎంపీపీల సంఘం కన్వీనర్ , అమరావతి ఎంపీపీ మేకల హనుమంతరావు అన్నారు. మండల పరిధిలోని వైకుంఠపురం సచివాలయ పరిధిలో శనివారం నిర్వహించిన జగనన్న సురక్షా పథకం గ్రామసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ జేసీఎస్ కన్వీనర్ నాయుడు రాంబాబు, గ్రామ ఉప సర్పంచ్ గుబ్బ కిష్టయ్య, తహసీల్దార్ విజయశ్రీ ఎంపీడీవో మాధురి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

నూరు శాతం సంక్షేమం అందించడమే లక్ష్యం

దమ్మాలపాడు(ముప్పాళ్ల): సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందించాలనే లక్ష్యంతోనే ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టారని జెడ్పీటీసీ సభ్యురాలు శిరిగిరి చంద్రకళ చెప్పారు. మండలంలోని దమ్మాలపాడు, ఇరుకుపాలెం గ్రామాల్లో జగనన్నసురక్ష క్యాంపు కార్యక్రమం శనివారం నిర్వహించారు. కార్యక్రమాల్లో తహసీల్దార్ ఎం.భవానీశంకర్, ఎంపీడీవో పి.పుట్టారెడ్డి, డెప్యూటీ తహసీల్దార్ సీహెచ్. లక్ష్మీప్రసాద్, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ కళ్ళం శివరామిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

పలువురికి సర్టిఫికెట్లు

క్రోసూరు: మండలంలోని ఊటుకూరు, అందుకూరు గ్రామాల్లో జగనన్న సురక్ష శిబిరాలు నిర్వహించారు. పలువురు లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందించారు. ఊటుకూరు లో ఏర్పాటు చేసిన శిబిరంలో 150 అర్జీలు రాగా వాటిలో 70 సర్టిఫికెట్లు సంబంధిత దరఖాస్తుదారులకు అందజేశారు. అందుకూరు శిబిరంలో 160 అర్జీలు రాగా వాటిలో 60 సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో బి.మహేష్, మండల ప్రత్యేక అధికారి ఎస్ పద్మశ్రీ , తహసీల్దార్ ఎండీ. జియావుల్ హక్, పంచాయతీ విస్తరణాధికారి పి.శివరామయ్య, ఎంపీపీ పి.కోటయ్య, వైస్ ఎంపీపీ విప్పల వెంకట్రామిరెడ్డి, జెడ్పీటీసీ జమీలాగఫూర్, గ్రామ సర్పంచ్ జంగా సౌభ్యావతిలక్ష్మి పాల్గొన్నారు.

జగనన్న సురక్ష...పేద ప్రజలకు రక్ష

పెదకూరపాడు: జగనన్న సురక్ష... పేద ప్రజలకు రక్ష అన్ని క్రోసూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ ఈదా సాంబిరెడ్డి అన్నారు. మండలంలోని 75 త్యాళ్ళూరు, జలాల్‌పురం సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, జేసీయస్ కన్వీనర్ మాగులూరి అనిల్‌కుమార్, మండల వైఎస్ ఎంపీపీ షేక్ చాంద్ బాష, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ షేక్ మస్తాన్ షరీఫ్, ప్రత్యేకాధికారి ధనలక్ష్మీలతో కలసి ప్రారంభించారు. జలాల్‌పురంలో మొత్తం 271 దరఖాస్తులు రాగా వాటిలో 40 మందికి ధృవీకరణ పత్రాలు అందించారు. 75త్యాళ్ళూరులో 70 దరఖాస్తులు రాగా వాటిలో 51 మందికి పత్రాలు అందించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్‌లు పరిశుద్ధ కుమారి, మాదిరెడ్డి సుజాత,, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

పెదకూరపాడు: ద్విచక్ర వాహనాలు ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని అబ్బరాజుపాలెం, 75 త్యాళ్లూరు మధ్య చప్టా వద్ద శనివారం జరిగింది. క్రోసూరుకు చెందిన ఆర్‌ఎంపీ పసుపులేటి జగన్, విజయకుమార్ 75 త్యాళ్లూరు మీదుగా గుంటూరులో సమావేశానికి వెళుతున్నారు. ఈ సమయంలో తాడికొండ మండలం గరికపాడు గ్రామానికి చెందిన మానుకొండ సుధీర్ ఫ్యామిలీతో అమరావతి వెళ్తున్నారు.ఈ క్రమంలో అబ్బరాజుపాలెం, 75 త్యాళ్లూరు చప్టా వద్ద అతి వేగంగా వెళుతున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. పసుపులేటి జగన్‌కు తీవ్రంగా గాయాలు కాగా మిగతా వారికి స్వల్ప గాయాలయ్యాయి. 108లో వైద్యశాలకు తరలించారు.

పంచాయతీ కార్యాలయానికి బీరువా బహూకరణ

అచ్చంపేట: మండలంలోని చెరుకుంపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయంలో రికార్డులు భద్రపరచుకునేందుకు స్నేహ హస్తాలు ఫౌండేషన్ శనివారం బీరువా బహూకరించింది. జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి, ఎంపీడీవో పి.శివసుబ్రహ్మణ్యం, ఎంపీటీసీ సభ్యురాలు సుంకర సీతమ్మల చేతులమీదుకు సర్పంచ్ చింతగుంట్ల అనూరాధ, హనుమందరెడ్డి దంపతులకు, పంచాయతీ కార్యదర్శి శివయ్యకు అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ కో–ఆర్డినేటర్ తాయి కరీముల్లాబాబు మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా పలు సేవా కార్యక్రమాల్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సర్పంచ్ విజ్ఞప్తి మేరకు బీరువా అందించినట్లు తెలిపారు.

రేపు గురు పౌర్ణమి వేడుకలు

సత్తెనపల్లి: ఆషాఢ శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకొని ఆదివారం పట్టణంలోని శరభయ్య గుప్తా హిందూ ఉన్నత పాఠశాల ఆవరణలో గల షిర్డీ సాయిబాబా మందిరంలో గురు పౌర్ణమి మహోత్సవం నిర్వహించనున్నట్లు షిర్డీ సాయిబాబా సేవా సమాజం అధ్యక్షుడు చల్లా రత్తయ్య శనివారం తెలిపారు. బాబాకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరుగుతాయన్నారు. గుంటూరు వారి స్వరాగ సుధ భక్తి గీతాలాపనతో పాటు అన్నసంతర్పణ ఉంటాయన్నారు.భక్తులు పెద్దసంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి జన్నవరపు సాంబిరెడ్డి, కోశాధికారి యెల్లినేడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆధార్ అప్‌డేట్ సెంటర్ ప్రారంభం

సత్తెనపల్లి: జగనన్న సురక్షలో భాగంగా సత్తెనపల్లి మండలం గుడిపూడిలో ఆధార్ అప్‌డేట్ సెంటర్‌ను వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కట్టా సాంబయ్య శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి సుధాకర్, ఎంపీడీవో జీవీ సత్యనారాయణ, జేసీఎస్ మండల ఇన్‌చార్జి బొంతు వెంకటరెడ్డి పాల్గొన్నారు.

వైద్యులు దేవునితో సమానం



సత్తెనపల్లి: వైద్యులు దేవునితో సమానమని మంత్రి అంబటి రాంబాబు అన్నారు. జాతీయ వైద్యుల దినోత్సవ సందర్భంగా పట్టణంలోని ఏరియా వైద్యశాలలో ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శనివారం కేక్ కట్ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో పలు ఆస్పత్రుల వైద్యులు పాల్గొన్నారు. ముందుగా మంత్రి అంబటి రాంబాబు కేక్ కట్ చేసి వైద్యులను పూలమాలు, దుశ్శాలువాలు, కిరీటాలతో సత్కరించారు. కార్యక్రమంలో నర్సింగ్ సూపరింటెండెంట్ డాక్టర్ రాధా, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో ఘనంగా డాక్టర్స్‌డే

క్రోసూరు: స్థానిక పీహెచ్‌సీలో శనివారం డాక్టర్ డే ఘనంగా నిర్వహించారు. డాక్టర్ బాలఅంకమ్మబాయికి పీహెచ్‌సీ అధికారులు, సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ పేద ప్రజలకు సేవలు అందించేందుకు డాక్టర్ వృత్తి అత్యంత గొప్పదని పేర్కొన్నారు. డాక్టర్ చేయి పట్టుకుంటే చాలు ఇక కోలుకుంటానన్న ఆత్మస్థైర్యం రోగుల్లో కలుగుతుందని, అందుకే వైద్యుడు నారాయణుడు లాంటి వాడని పెద్దలు చెబుతారని వివరించారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి పేద ప్రజల్ని ఆరోగ్య సమస్యల నుంచి కాపాడేందుకు ఫ్యామిలీ డాక్టర్, ఆరోగ్యశ్రీ, అందుబాటులోకి తీసుకొచ్చారని ఆమె తెలిపారు. కార్యక్రమంలో స్టాఫ్ నర్సులు, ఏఎన్‌ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న ఆర్టీసీ బస్సు: ఇద్దరికి గాయాలు

బెల్లంకొండ: ఆర్టీసీ బస్సు అదుపు తప్పి ఆటోను ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని వెంకటాయపాలెం సమీపంలో శనివారం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న మండలంలోని వెంకటాయపాలెం గ్రామానికి చెందిన మేళం కోటేశ్వరరావు, అతని కుమార్తె యశోద తీవ్రంగా గాయపడ్డారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో ఇంటి వద్దే మెరుగైన వైద్య సేవలు

ముప్పాళ్ల: ప్రజలకు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ఇంటివద్దే మెరుగైన సేవలు అందిస్తున్నారని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి శోభారాణి అన్నారు. మండలంలోని నార్నెపాడులో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని శనివారం ఆమె పరిశీలించారు. సేవలు మరింత మెరుగుపరుచుకోవాలని సిబ్బందికి సూచించారు. అనంతరం రోగుల వద్దకు వెళ్లి వారికి అందుతున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు.

రాజుపాలెంలో..

మండలంలోని నెమలిపురిలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలు అందించారు. డాక్టర్ కృష్ణకుమార్ 112 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు.

డెంగీ నివారణపై అవగాహన ర్యాలీలు

సత్తెనపల్లి: పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దరి చేరవని సత్తెనపల్లి పట్టణ మలేరియా సబ్‌యూనిట్ అధికారి సీహెచ్. ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మలేరియా సబ్‌యూనిట్ ఆధ్వర్యంలో డెంగీ నివారణ మహోత్సవంలో భాగంగా శనివారం వ్యవసాయ మార్కెట్ యార్డు, వెంగళరెడ్డినగర్, వడ్డవల్లి పట్టణ ఆరోగ్య కేంద్రాల సహకారంతో ర్యాలీ నిర్వహించారు. వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు. రాజుపాలెం: ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో డెంగీ నివారణపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు శనివారం ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి రవితేజనాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి కూలీల నిరసన

ముప్పాళ్ల:పనికి తగ్గ వేతనం గురించి అడిగితే ఏపీఓ రామారావు దురుసుగా మాట్లాడుతున్నాడని చాగంటివారిపాలెం ఎస్టీ కాలనీవాసులు శనివారం ఎంపీడీవో కార్యాలయం ప్రధాన గేటు వద్ద కూర్చొని నిరసన తెలిపారు. గ్రామానికి చెందిన సుమారు 90 మంది గత నెలలో ఉపాధి హామీ పథకం పనులు చేశారు. అయితే, గతంలో వారం రోజులకు గాను రూ.1373 జమ కాగా, ఆ తర్వాత చేపట్టిన పనులకు రూ.976 మాత్రమే జమ అయ్యాయి. అదేమని ఏపీవోను అడగ్గా తమతో దురుసుగా మాట్లాడుతున్నారని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని కోరారు. నిరసనలో ఉసర్తి మోహనరావు, కొజ్జా సాంబశివరావు, కుంభా శ్రీనివాసరావు, ఉసర్తి శ్రీనివాసరావుతో పాటు పలువురు మహిళలు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆఫ్ సత్తెనపల్లికి అవార్డుల పంట

సత్తెనపల్లి: రోటరీ క్లబ్ ఆఫ్ సత్తెనపల్లికి అవార్డుల పంట పండింది. రోటరీ డిస్ట్రిక్ట్ 3150 ద్వారా 2022–23 సంవత్సరానికి గాను క్లబ్ ద్వారా చేసిన సేవా కార్యక్రమాలకు ఆరు అవార్డులు ప్రదానం చేశారు. స్మాల్ క్లబ్స్ కేటగిరీలో మొదటి స్థానాన్ని, పర్యావరణ పరిరక్షణ, బాలికలకు సైకిల్ పంపిణీ, ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న వారికి కుటుంబ ఆసరాకు ఉపయోగపడే విధంగా కుట్టుమిషన్ల పంపిణీ, మంచినీటి వసతి లేని ప్రాంతాల్లో రెండు బోర్ వెల్స్ ఏర్పాటు చేయడం, పేద విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ, మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయడం, వికలాంగులకు ట్రై సైకిల్ పంపిణీ మొదలైన కార్యక్రమాలకు గాను రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ తాళ్ల రాజశేఖర్ రెడ్డి చేతుల మీదగా ఈ అవార్డు అందుకున్నట్లు క్లబ్ ప్రెసిడెంట్ పాయసం మహేష్ బాబు శనివారం తెలిపారు.